సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



'స్నో' అందాలు

మన్యంలో వాతావరణ పరిస్థితుల్లో కొద్దిరోజులుగా మార్పు కనిపిస్తోంది. వేకువజాము నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఆదివారం శీతాకాలాన్ని తలపించేలా పాడేరు పరిసర ప్రాంతాల్లో మంచు తెరలు అలముకున్నాయి. ఈ ప్రకృతి దృశ్యాలను చూసి సందర్శకులు పరవశించిపోయారు. మంచుతెరల కారణంగా వాహనచోదకులు ఫ్లడ్ లైట్ల వెలుగులో రాకపోకలు సాగించారు. - సాక్షి,పాడేరు

వైద్యుల్లేక ఇబ్బందులు



పాడేరు మండలం గెడ్డంపుట్టుకు చెందిన ఈమె పేరు దూరు విజయలక్ష్మి. భర్త మోహన్‌రావుకు రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. బాగా నీరసించడంతో అతనిని ఆదివారం ఉదయం మినుములూరు పీహెచ్‌సీకి తీసుకువచ్చింది. వైద్యుల గది మూసి ఉంది. వైద్యసిబ్బంది పరీక్షించి సేవలు అందిస్తున్నారు. వైద్యులు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆమె వాపోయింది.

పురిటి సమయంలో భయమేసింది



పాడేరు మండలం పోతురాజుమెట్టకు చెందిన అతని పేరు పాంగి జోగి. భార్యకు నెలలు నిండటంతో మూడు రోజుల క్రితం మినుములూరు పీహెచ్‌సీలో చేర్పించాడు. వైద్యులు సమ్మె కారణంగా అందుబాటులో లేరు. వైద్యసిబ్బంది సుఖ ప్రసవం చేశారు. వైద్యులు లేనందున పురిటి సమయంలో చాలా భయమేసింది. స్టాఫ్‌నర్సులు, సిబ్బంది ధైర్యం చెప్పి కాన్పు చేశారని జోగి పేర్కొన్నాడు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల నిరవధిక సమ్మెతో పల్లెల్లో వైద్య సేవలు పడకేశాయి. పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ రిజర్వేషన్లను పాత విధానం ప్రకారమే ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న ఎంబీబీఎస్ వైద్యాధికారులను కొనసాగించాలని కొద్దిరోజులుగా పీహెచ్‌సీ వైద్యులు సమ్మె చేస్తున్నారు. దీని ప్రభావం పేదల వైద్యసేవలపై చూపుతోంది. వైద్య బృందాలను అప్రమత్తం చేశామని జిల్లా అధికార యంత్రాంగం చెబుతున్నా అత్యవసర వైద్యం అందక జిల్లాలో ఇప్పటికే ఇద్దరు చిన్నారులు మృతి చెందారు.

పడకేసిన పల్లె వైద్యం

- పీహెచ్‌సీ వైద్యుల సమ్మెతో గిరిజనులకు అవస్థలు
- వైద్యసిబ్బందే దిక్కు
- ప్రాథమిక వైద్యానికి పరిమితం
- అందని అత్యవసర వైద్యం
- పరిస్థితి విషమిస్తే కష్టమే
- గాలిలో దీపంలా గర్భిణుల ప్రాణాలు
- నామమాత్రంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



మినుమూలూరు పీహెచ్‌సీలో బాలింతలు



వైద్యుల సమ్మెతో తెరచుకోని మినుములూరు పీహెచ్‌సీలోని వైద్యుని గది



మినుములూరు పీహెచ్‌సీలో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

సాక్షి,పాడేరు: పీహెచ్‌సీ వైద్యుల సమ్మె వల్ల జిల్లాలోని 22 మండలాల్లోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య పరీక్షలు నిలిచిపోయాయి. పీజీ విద్యకు సంబంధించి జీవో నంబరు రద్దు డిమాండ్‌తో జిల్లాలోని 128 మంది వైద్యులు సమ్మె బాట పట్టారు. దీంతో గిరిజన ప్రాంతాల్లో తొమ్మిది రోజుల నుంచి వైద్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పీహెచ్‌సీలో వైద్యులు లేనందున సిబ్బందిపై భారం పడింది. దీనివల్ల అంతంతమాత్రంగా సేవలు అందుతున్నాయి.

15 నుంచి విధులకు దూరం

జిల్లాలోని 64 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులంతా ఈనెల 15 నుంచి విధులకు దూరమయ్యారు. ఈనెల 9వతేదీ నుంచి పీహెచ్‌సీల్లో వైద్యులంతా జీవో నంబరు85ను రద్దు చేయాలని నిరసన కార్యక్రమాలు చేపడుతూనే రోగులకు వైద్యసేవలు అందించేవారు.అయితే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 15వతేదీన ఛలో విజయవాడ ఆందోళనకు జిల్లాలోని వైద్యులంతా తరలివెళ్లారు. ప్రభుత్వంతో చర్చలు విఫలమవడంతో 16వ తేదీ నుంచి వారంతా ఓపీని బహిష్కరించి సమ్మె బాట పట్టారు.

రోగులకు తీవ్ర ఇబ్బందులు

గిరిజన ప్రాంతం కావడంతో ప్రైవేట్ ఆస్పత్రులు పెద్దగా లేవు. దీంతో మారుమూల ప్రాంతాల ప్రజలు పీహెచ్‌సీల్లో వైద్యసేవలపై ఆధారపడ్డారు. ఇప్పుడు ప్రథమ చికిత్సకే పరిమితం అవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- నెలలు నిండిన గర్భిణులను సుఖప్రసవాలకు పీహెచ్‌సీలకు తరలివస్తున్న తరుణంలో వారికి కాన్పులు కూడా వైద్యసిబ్బందే నిర్వహిస్తున్నారు. అత్యవసర వైద్యం అవసరమైన రోగులు, గర్భిణులను సమీప కమ్యూనిటీ ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, పాడేరులో జిల్లా సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు.
- జిల్లాలోని 22 మండలాల్లో ముంచంగిపుట్టు, చింతూరు, వై.రామవరం, అడ్డతీగల, కూనవరంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు,, అరకులోయ, రంపచోడవరం, చింతపల్లిలో ఏరియా ఆస్పత్రులు, పాడేరులో జిల్లా ఆస్పత్రి ఉన్నాయి. పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులో లేకపోవడంతో ఆయా ఆస్పత్రులకు తరలించేందుకు రోగుల బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో అంబులెన్సులు అందుబాటులో ఉండటం లేదు. దీనివల్ల అత్యవసర వైద్యం అందక ప్రాణాలు పోయిన ఘటనలు నెలకొన్నాయి.

అంబులెన్సు అందుబాటులో లేక..

అనంతగిరి మండలం పినకోటకు చెందిన సిరగం లాస్య పచ్చకామెర్లతో పరిస్థితి విషమంగా మారింది. అక్కడి పీహెచ్‌సీ వైద్యులు సమ్మెకారణంగా అందుబాటులో లేరు. దీంతో ఆమె అత్యవసర వైద్యం అందని పరిస్థితి ఎదురైంది. సమీప ఆస్పత్రికి తరలించేందుకు కనీసం అంబులెన్సు కూడా అందుబాటులో లేదు. ఈ పరిస్థితుల్లో శనివారం ఆమెను బైక్‌పై సమీప అనకాపల్లి జిల్లా దేవరాపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది.

- ఇదే మండలంలోని టోకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన సుకూరు అప్పలకొండ అనే గిరిజన విద్యార్థికి వైద్యులు సమ్మెలో ఉన్నందున వ్యాధి నిర్ధారణ కరువైంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆమెను విజయనగరం జిల్లా ఎస్.కోట కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈ మరణాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే వైద్యులు సమ్మెలో ఉన్నప్పటికీ వైద్యసిబ్బంది ఇద్దరికి వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా వివరించారు.

వైద్యబృందాలను అప్రమత్తం చేశాం

వైద్యులు సమ్మెతో విధులకు దూరమైన నాటి నుంచి 104 వైద్యులతో పాటు పీహెచ్‌సీ వైద్య బృందాలను అప్రమత్తం చేశాం. పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు వైద్యసిబ్బంది ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారు. అత్యవసరమైతే సమీప పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు.రోగులను తరలించేందుకు అంబులెన్స్‌లు కూడా అందుబాటులో ఉంచాలని వైద్యబృందాలను ఆదేశించాం. అలాగే గిరిజన ప్రాంతాలలో వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని వైద్యులంతా సమ్మె వీడాలని వారికి లేఖలు పంపుతున్నాం.

– డాక్టర్ జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

న్యూస్‌రీల్

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

- ఏఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా



చింతూరు: దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసే బాణసంచా దుకాణాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా సూచించారు. ఆదివారం ఆయన చింతూరులో మాట్లాడుతూ టపాసులు విక్రయించే దుకాణదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విధిగా లైసెన్సు పొందాలన్నారు. జనావాసాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులకు దూరంగా అధికారులు సూచించిన ప్రదేశాల్లో మాత్రమే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి షాపువద్ద అగ్ని నిరోధక సిలిండర్లు, పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలని, మైనర్లను విక్రయాల్లో వినియోగించకూడదని ఆయన ఆదేశించారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ



చింతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

చింతూరు: మండల కేంద్రంలో ఆదివారం ఆదివాసీల ఆధ్వర్యంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయిస్టులు ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, వారు తమ ప్రాంత అభివృద్ధికి అడ్డంకిగా మారారని ఆరోపిస్తూ నినాదాలు చేశారు.

దసరా ఉత్సవాలకు పందిరిరాట



పందిరిరాటకు పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ, గ్రామపెద్దలు

సాక్షి,పాడేరు: స్థానిక మెయిన్‌రోడ్డులోని ఆస్పత్రి సెంటర్‌లో వచ్చే నెల 8నుంచి 12 వరకు నిర్వహించే దసరా ఉత్సవాలకు పందిరిరాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం రామకృష్ణారావు, ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెయ్యాకుల సత్యనారాయణ, యాదగిరి శ్రీను, పచ్చా బుజ్జి, మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదమ్మ ఇంటి పండగలు



మోదకొండమ్మతల్లి ఘటాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లి ఇంటి పండగలను స్థానిక భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. మైదాన ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు భవాని మాలధారులు మోదమ్మను దర్శించుకున్నారు. భక్తుల సహకారంతో ఆలయ కమిటీ ఉచిత భోజనం ఏర్పాటుచేసింది.

చాపరాయిలో పర్యాటకుల సందడి



డుంబ్రిగుడ: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్ద పర్యాటకుల రాకతో సందడి నెలకొంది. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. బేంబూ చికెన్, బిర్యానీ, చీకులు, వేరుశనగ, మొక్కజొన్న అమ్మకాలు భారీగా జరిగాయి. వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో శిశువు మృతి



మృతి చెందిన శిశువు

పెదబయలు: మండలంలోని గుల్లేలు పంచాయతీ పెద వంచరంగిలో అనారోగ్యంతో బాధపడుతున్న శిశువు మృతి చెందింది. ఈ గ్రామానికి చెందిన వంచుర్ల వెంకటేశ్వర్లు, పద్మకుమారి దంపతులకు చెందిన రెండు నెలల శిశువు (పాప)కు రెండు రోజుల నుంచి ఆరోగ్యం బాగోలేదు. ఆదివారం రాత్రి ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు సిద్ధపడుతుండగా వాంతులు, విరోచనాలతో మృతి చెందిందని కుటుంబసభ్యులు తెలిపారు. ఇలావుండగా గ్రామంలో జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉన్నందున వైద్య శిబిరం ఏర్పాటుచేయాలని మాజీ సర్పంచ్ సాగేని నాగరాజు గ్రామస్తులు కోరారు.

దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం

- ప్రభుత్వానికి ప్రతిపాదన
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం పంపిణీ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన నష్టపరిహారం వివరాలను పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో పొందుపరిచినట్టు తెలిపారు. బాధితులంతా వివరాలను పరిశీలించుకుని అభ్యంతరాలు, ఇతర క్లయిమ్‌లను తహసీల్దార్/ ఎంపీడీవోల దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరారు.

నీట మునిగిన గ్రామాల ప్రజలకు జీవన భృతి

చింతూరు ఐటీడీఏ పరిధిలోని ముంపు మండలాల్లో ఇటీవల వరదలకు నీట మునిగిన గ్రామాల ప్రజలకు జీవనోపాధి కొల్పోయినందున ప్రభుత్వ నిబంధనల మేరకు జీవన భృతి పంపిణీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ తెలిపారు. బాధితుల వివరాలను చింతూరు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లోను పొందుపరిచామన్నారు. వాటిని పరిశీలించుకుని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను తహసీల్దార్/ఎంపీడీవోల దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు.

వంద రోజుల పాలన మోసపూరితం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి,పాడేరు: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన అంతా మోసమేనని, ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ అమలుచేయలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆమె ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 100రోజుల పాలనలో గిరిజనులకు కూడా ఒరిగిందేమి లేదని, అన్యాయమే మిగిలిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. అన్నదాత సుఖీభవతో ఆర్థిక సాయం ఇస్తానన్న కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో ఒక్క రూపాయి కూడా ఇవ్వక పోవడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా రైతుభరోసా పథకం ద్వారా రైతులకు వ్యవసాయ పెట్టుబడి అందించిందని, కూటమి ప్రభుత్వం మాత్రం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయలేదన్నారు. మహిళలకు కూడా ఆర్థికసాయం హామీలకు పరిమితమైందన్నారు. అమలుకాని హామీలతో ఓటర్లను ప్రలోభ పెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఏమి చేయకుండానే మంచి ప్రభుత్వమంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, ఎంపీటీసీ చల్లా చిట్టమ్మ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి లకే రామసత్యవతి, మండల పార్టీ, యువజన విభాగం ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి నాగేంద్ర, కొట్టగుళ్లి కొండాజీ, వంతాల నరేష్ పాల్గొన్నారు.

ప్రచారానికే పరిమితం : అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విమర్శ

అరకులోయ టౌన్: కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన కేవలం ప్రచారానికే పరిమితమైందని, చేసిందేమీ లేదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. వందరోజుల పాలనలో ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదన్నారు. ఓట్ల కోసం చంద్రబాబు దేనికైనా భరితెగిస్తారన్నారు. తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లులకు ఎగనామం పెట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడు నెలల్లో 87 శాతం హామీలు అమలు చేసిందన్నారు. ఖరీఫ్ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి హామీకి పరిమితమైందన్నారు. సూపర్ సిక్స్ ఊసేలేదన్నారు. వందరోజుల పాలనలో ప్రజల ఆశలను నట్టేట ముంచారన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా జవహర్‌కుమార్



జవహర్‌కుమార్

సాక్షి,పాడేరు: ఆర్‌డబ్ల్యూఎస్ పాడేరు ఈఈగా జవహర్‌కుమార్ నియమితులయ్యారు. అనంతపురంలో ఈఈగా పనిచేస్తున్న ఆయన అనారోగ్య సమస్యలతో సెలవు పెట్టారు. బదిలీల్లో భాగంగా ఆయనను ప్రభుత్వం పాడేరు ఈఈగా నియమించింది. గతంలో ఈయన పాడేరు ఇన్‌చార్జి ఈఈగా పనిచేసి పదోన్నతిపై అనంతపురం జిల్లాకు వెళ్లారు.

డ్వామా పీడీగా రామచంద్రరావు

జిల్లా డ్వామా పీడీగా కె.రామచంద్రరావు నియమితులయ్యారు.పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం నియమించింది.ఇక్కడ పీడీగా పనిచేస్తున్న కె.శివయ్యను పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేసింది.

డీపీవోగా లావరాజు

జిల్లా పంచాయతీ అధికారిగా ఎస్.లావరాజు నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అధికారిగా పనిచేస్తున్న ఆయనను పాడేరు డీపీవోగా ప్రభుత్వం నియమించింది.ఇక్కడ డీపీవోగా పనిచేస్తున్న టి.కొండలరావుకు ఇంకా ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు.అలాగే డీఎల్‌డీవోగా పనిచేస్తున్న డి.శాంతలక్ష్మిని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ అధికారిగా బదిలీ అయింది. పాడేరు డీఎల్‌డీవో స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

అప్పటివరకు ఎంతో ఉత్సాహంగా సాగిన వైద్య విద్యార్థుల విహారయాత్ర ఒక్కసారిగా ఊహించని మలుపు తిరిగింది. కొండల్లో కురిసిన భారీ వర్షానికి జలపాతం (వాగు) ఉన్నట్టుండి పొంగింది. అప్పటివరకు నీటిలో కేరింతలు కొడుతూ.. ఫొటోలు దిగుతూ.. ఉత్సాహంగా స్నానాలు చేస్తున్న వారిపై విరుచుకుపడటంతో ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో ముగ్గురు గల్లంతు కాగా, ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు.

వాగులో వేదన

- జలతరంగిణి జలపాతంలో ఏలూరు ఆశ్రం వైద్య విద్యార్థులు ముగ్గురు గల్లంతు
- భారీ వర్షానికి ఉప్పొంగడంతో ప్రమాదం
- గాలింపు చర్యలు ముమ్మరం
- లభ్యం కాని ఆచూకీ



భారీ వర్షానికి ఉప్పొంగిన వాగు (జలపాతం)



ఇద్దరు విద్యార్థినులు బయటపడిన ప్రాంతం





రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయత్రి పుష్ప, హరిణీప్రియ



ప్రమాదానికి ముందు కాకినాడ బీచ్‌లో గ్రూప్ ఫొటో

మారేడుమిల్లి: విహారయాత్రకు వచ్చిన వైద్య విద్యార్థుల్లో ముగ్గురు ఊహించని పరిస్థితుల్లో వాగు ప్రవాహానికి కొట్టుకుపోగా, ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ఏలూరుకు చెందిన ఆశ్రం వైద్య కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14 మంది విద్యార్థులు ఆదివారం ఉదయం కాకినాడలోని స్నేహితుల ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి నగరంలోని బీచ్‌కు వెళ్లి అక్కడ కాసేపు ఉత్సాహంగా గడిపారు. అందరూ గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం వ్యాన్‌లో విహారయాత్రకు మారేడుమిల్లి వచ్చారు. అక్కడి నుంచి జలతరంగిణి (వాగు) జలపాతం వద్దకు చేరుకున్నారు. అందరూ దిగి స్నానాలు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కొండల్లో భారీ వర్షం కురిసింది. రెట్టించిన ఆనందంతో కేరింతలు కొడుతున్న తరుణంలో ఉన్నట్టుండి వాగు ఉప్పొంగింది. ఇది గమనించిన తొమ్మిది మంది విద్యార్థులు ఒడ్డుకు వచ్చేశారు. ప్రవాహం మధ్యలో ఉన్న సీహెచ్ హరదీప్, కె.సౌమ్య, బి.అమృత, గాయత్రీ పుష్ప, హరిణీప్రియ కొట్టుకుపోయారు.

ఇద్దరిని కాపాడిన చెట్టుకొమ్మ

కొట్టుకుపోయిన ఐదుగురిలో గాయత్రీ పుష్ప, హరిణీప్రియ చెట్టుకొమ్మను పట్టుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సంఘటన జరిగిన ప్రాంతానికి ఆరు కిలోమీటర్ల దూరంలో భద్రాచలం ప్రధాన రహదారి కల్వర్టు వద్ద వీరిని స్థానికులు, రెస్క్యూ టీం గుర్తించారు. వెంటనే ఒడ్డుకు చేర్చారు. మిగతా హరిదీప్, సౌమ్య,అమృత ఆచూకీ లభ్యం కాలేదు. ప్రాణాలతో బయటపడిన హరిణీప్రియ పరిస్థితి విషమంగా ఉంది. వాగులో మునిగి నీళ్లు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బండరాళ్ల కారణంగా గాయపడిన గాయత్రీ పుష్ప రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గల్లంతైన వారికోసం రాత్రి ఏడు గంటల వరకు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ రాము తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చిన ఇద్దరు వైద్య విద్యార్థులను పరామర్శించారు. చికిత్స పొందుతున్న గాయత్రీ పుష్పకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

21న కళాశాలను విడిచి..

ఏలూరు టౌన్: ఈనెల 21న ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు సెలవుపై ఇళ్లకు వెళ్లారని ఆ కళాశాల సీఈవో కె.హనుమంతరావు తెలిపారు. సెలవుపై వెళ్లిన వారిలో కొందరు తమ స్నేహితులతో కలిసి మారేడుమిల్లి విహారయాత్రకు వెళ్లగా ప్రమాదానికి గురయినట్లు తెలిసిందన్నారు. ఎవరు విహారయాత్రకు వెళ్లారు అనే దానిపై కళాశాల సిబ్బంది ఆరా తీస్తున్నారని తెలిపారు. కె.సౌమ్య, బి.అమృత ఇద్దరు యువతులు విజయనగరం, ఒక విద్యార్థి సీహెచ్ హరదీప్ ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించామన్నారు. ప్రమాద సంఘటనలో పరిస్థితులు తెలుసుకుంటూ ఉన్నామని సీఈవో తెలిపారు.

పర్యాటకులకు అనుమతి లేదు



సబ్ కలెక్టర్ కల్పశ్రీ

మారేడుమిల్లి: రంపచోడవరం ఏజెన్సీలో భారీ వర్షాల కారణంగా వాగులు పొంగి ప్రవహిస్తున్నందున మారేడుమిల్లి తదితర అన్ని పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులను అనుమతించడం లేదని సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలకు వచ్చే వారిని జలపాతాల వద్దకు అనుమతించ వద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గేవరకు ఈ నిబంధన కొనసాగుతుందన్నారు. కాగా పర్యాటక ప్రాంతాలకు వచ్చే వారు తిరిగి ఇళ్లకు వెళ్లే వరకు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. వాగులు దాటే సాహసం చేయవద్దన్నారు.

క్లుప్తంగా

జెడ్పీ సీఈవోగా నారాయణమూర్తి



విశాఖ : ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పి.నారాయణమూర్తిని నియమించారు. నారాయణమూర్తి కాకినాడలో డీఎల్డీవోగా పనిచేస్తున్నారు. విశాఖ సీఈవోగా పనిచేసిన పోలినాయుడు మంత్రి వద్ద ఓఎస్డీగా వెళ్లారు. ఇంత వరకు డిప్యూటీ సీఈవో సత్యనారాయణ ఇన్చార్జి సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు ఆయన్ని శ్రీకాకుళం డిప్యూటీ సీఈవోగా బదిలీ చేశారు. ఇక్కడకు డిప్యూటీ సీఈవోగా డి.రాజ్‌కుమార్‌ను నియమించారు.

మైనింగ్ శాఖ డీఎంజీవోగా జగన్నాథరావు

ఆరిలోవ: జిల్లా మైనింగ్ శాఖ డీఎంజీవో గంజి వెంకటేశ్వర్లను అనంతపురం జిల్లా డీఎంజీవోగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఒంగోలులో డీఎంజీవోగా పనిచేస్తున్న జగన్నాథరావు నియమితులయ్యారు.

పేదల ఆర్థికాభివృద్ధికి కృషి



స్త్రీనిధి మేనేజర్ ప్రవీణ్

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని డ్వాక్రా సంఘ సభ్యులతో అడ్డతీగల క్లస్టర్ స్త్రీనిధి మేనేజర్ ప్రవీణ్ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పొదుపు సంఘాలకు రుణాలు అందించి పేద మహిళలకు ఆర్థిక చేయూతనందిస్తున్నామన్నారు. గతేడాది అడ్డతీగల, వై.రామవరం, గంగవరం, రాజవొమ్మంగి మండలాల్లో రూ.4.20 కోట్ల మేర మహిళలకు రుణాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాది ఈ నాలుగు మండలాల్లో రూ.7 కోట్లు స్త్రీనిధి రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ. 2.83 కోట్ల మేర రుణాలు అందజేశామన్నారు. డివిజన్‌లోని 55 పొదుపు సంఘాలకు చెందిన 287 మంది లబ్ధిపొందారన్నారు. రుణాలు పొందిన లబ్ధిదారులు చిరువ్యాపారాలు నిర్వహించి, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్క డ్వాక్రా మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తీరం కిటకిట



బీచ్‌రోడ్డు: విశాఖ సాగరతీరం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. ఆహ్లాదకర వాతావరణంలో గడపడానికి ఆర్.కె.బీచ్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చి.. సందడి చేశారు. చిన్నారులు, మహిళలు సముద్రంలో స్నానాలు చేసి ఆనందించగా.. యువతీ యువకులు తీరంలో సెల్ఫీలు తీసుకుని సంబరపడ్డారు. భారీగా సందర్శకులు తరలివచ్చిన నేపథ్యంలో బీచ్‌గార్డ్స్ ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తూ భద్రత కల్పించారు. సందర్శకులు సముద్రంలోకి వెళ్లొద్దని, ప్రమాదకరమైన ప్రదేశాలను దాటవద్దని హెచ్చరించారు.

అంకుర వికాసం.. ఉపాధికి ఊతం

ANDHRA PRADESH Innovation Society

అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు ఎదురుచూస్తున్న యువతని చేయి పట్టి నడిపించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్ధం చేసిన వ్యవస్థ.. ఇప్పుడు ఫలాలందిస్తోంది. గతంలో జరిగిన చర్చలు సఫలీకృతం కావడంతో తాజాగా స్టార్టప్‌లకు అంతర్జాతీయంగా చేయూతనందించే యూఎస్ ఏజెన్సీతో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ(ఏపీఐఎస్) ఒప్పందం కుదుర్చుకుంది. గ్లోబల్ ఫండింగ్, వనరులు కల్పన, పెట్టుబడిదారులను సమకూర్చడమే లక్ష్యంగా అంకుర సంస్థలకు ఈ ఏజెన్సీ ఆసరాగా నిలవనుంది.

- యూఎస్ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్న ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చర్చలు సఫలీకృతం
- రాష్ట్రంలోని స్టార్టప్‌లకు సహకారం అందించనున్న స్టార్టప్ రన్ వే సంస్థ
- ఇప్పటికే రెండు స్టార్టప్‌లను ఎంపిక చేసిన యూఎస్ ఏజెన్సీ
- గ్లోబల్ ఫండింగ్, వనరులు, పెట్టుబడిదారులను సమకూర్చడమే లక్ష్యం

సాక్షి, విశాఖపట్నం : ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో అంకురిస్తున్న స్టార్టప్‌లకు కొత్త అవకాశాలను సృష్టించేందుకు యూఎస్ సొసైటీకి చెందిన స్టార్టప్ రన్ వే అనే సంస్థతో జతకట్టింది. ఐటీ రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు స్టార్టప్‌లకు చేయూతనందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్న అవకాశాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించింది. 2022–23లో పలు మార్లు యూఎస్ ఏజెన్సీతో ఏపీఐఎస్ ప్రతినిధులు చర్చలు జరిపారు. ప్రభుత్వ విధానాలకు సంతృప్తి చెందిన స్టార్టప్ రన్‌వే సంస్థ.. రాష్ట్రంలోని అంకుర సంస్థలకు చేయూతనందించేందుకు అంగీకారం తెలిపింది. ఈ ఏజెన్సీ ఇప్పటికే రాష్ట్రం నుంచి రెండు స్టార్టప్‌లను ఎంపిక చేసింది. విశాఖలోని ఐటీ సెజ్‌లో ఉన్న గ్లోబల్ క్లైమేట్ రిస్క్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (జీసీఆర్ఎస్), అంతర్ ఐవోటీ సంస్థలకు గ్లోబల్ చేయూతనందించే ప్రక్రియ ప్రారంభమైంది.

గ్లోబల్ ఫండింగ్‌తో స్టార్టప్‌ల వృద్ధి

మరిన్ని స్టార్టప్‌లను ఎంపిక చేసి, గ్లోబల్ ఫండింగ్ ద్వారా వనరులు సృష్టించి.. ఆ సంస్థలు విజయవంతం అయ్యేందుకు అవసరమైన సహకారాన్ని యూఎస్ ఏజెన్సీ అందజేయనుంది. కార్పొరేట్ భాగస్వాములతో స్టార్టప్ ప్రతినిధులను జతకట్టించి.. సంస్థల అభివృద్ధికి పెట్టుబడిదారులు, పరిశ్రమల నిపుణులను అందించేందుకు సహకరిస్తుంది. తద్వారా గ్లోబల్ నెట్‌వర్క్ మెరుగుపరచడంతో పాటు మార్కెట్‌ను పెంపొందించడం, నిధుల అవకాశాలను సృష్టించడం, అంతర్జాతీయ మార్కెట్‌లోకి ఆహ్వానించి.. స్టార్టప్‌లు కీలక సంస్థలుగా బలోపేతం చేసేందుకు ఏపీఐఎస్ దోహదపడుతుంది. ప్రస్తుతం గ్రీన్, సస్టైనబుల్ ఎనర్జీ, ఏఐ, బ్లాక్‌చెయిన్, సైబర్ సెక్యూరిటీ తదితర సాంకేతికతలపై పనిచేస్తున్న స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను ఇందులో భాగస్వామ్యం చేసేందుకు ఏపీఐఎస్ అన్వేషిస్తోందని సంస్థ ప్రతినిధి అనిల్‌కుమార్ తెలిపారు.

STARTUP RUNWAY

జీసీఆర్ఎస్ స్టార్టప్



పర్యావరణ సుస్థిరతకు సంబంధించిన సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన ఆవిష్కరణలతో జీసీఆర్ఎస్ స్టార్టప్ పనిచేస్తోంది. ఈ సంస్థలోని నిపుణుల బృందం ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెన్సీ, సలహా సేవలను అందించడమే కాకుండా విభిన్న సంస్థలకు సంబంధించిన ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక పరిష్కారాలు, సాంకేతికతను అభివృద్ధి చేసి అందిస్తుంటుంది. ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు, విద్య, పరిశోధన సంస్థలతో ఈ స్టార్టప్ జతకట్టింది. ప్రస్తుతం ఈ సంస్థ యూఎస్ ఏజెన్సీ చేయూతనందించేందుకు ఎంపికైంది.

అంతర్ స్టార్టప్



ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, నెక్స్ట్ జెన్ టెక్నాలజీలో ప్రత్యేకత కలిగిన స్టార్టప్ అంతర్. సురక్షితమైన, అధిక నాణ్యత, సాంకేతికంగా అధునాతనమైన స్మార్ట్ ఉత్పత్తుల శ్రేణిని అభివృద్ధి చేస్తారు. ఐవోటీ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫారమ్ ద్వారా సంస్థల కార్యచరణ సామర్థ్యాలు మెరుగుపరిచేలా సొంత స్మార్ట్ ఉత్పత్తులు అందిస్తోంది. స్మార్ట్ మాడ్యుల్–ఎక్స్‌పీ, 2ఎక్స్ పవర్ స్మార్ట్ హోమ్, గేట్‌వే సాఫ్ట్‌వేర్, సెన్సార్లు మొదలైన ఉత్పత్తులు కీలక సంస్థలకు అందజేస్తోంది. అంతర్ ఐవోటీ ప్లాట్‌ఫారమ్ ద్వారా రియల్‌టైమ్ డివైజ్ మానటరింగ్ మేనేజ్‌మెంట్, డేటా అనాలసిస్, యూజర్ ఫ్రెండ్లీ డాష్‌బోర్డ్, సెక్యూర్ ఇన్‌ఫ్రా తదితర సౌకర్యాలు కల్పించనుంది. ఈ సంస్థను కూడా స్టార్టప్ రన్‌వే సంస్థ ఎంపిక చేసింది.

ఉమ్మడి విశాఖలో 16 మంది తహసీల్దార్ల బదిలీ

మహారాణిపేట (విశాఖ) : ఉమ్మడి విశాఖ జిల్లాలో 16 మంది తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ బదిలీ చేశారు. వీరిలో ఎనిమిది మందిని విశాఖ జిల్లాకు.. ఐదుగుర్ని అనకాపల్లి జిల్లాకు.. ముగ్గురు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. ఏఎస్ఆర్ జిల్లా నుంచి వచ్చిన ఎం.బి. అప్పారావును విశాఖ కలెక్టరేట్ మెజిస్టీరియల్ సెక్షన్‌కు, పి.లచ్చాపాత్రుడ్ని మహారాణిపేట తహసీల్దార్‌గా, అనకాపల్లి నుంచి వచ్చిన ఎస్.రాణిఅమ్మాజిని ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ తహసీల్దార్‌గా నియమించారు. అలాగే అనకాపల్లి నుంచి వచ్చిన కె.జానకమ్మను విశాఖ జిల్లా ఆర్డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా, పెదగంట్యాడ తహసీల్దార్ ఎల్.రామారావును అనకాపల్లి జిల్లాకు, విశాఖ జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎ.శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఆర్డీవో ఏవోగా ఉన్న కె.రమాదేవిని అనకాపల్లి జిల్లాకు, ఏఎస్ఆర్ నుంచి వచ్చిన ఎస్.నాగమ్మను అనకాపల్లి జిల్లాకు, ఏఎస్ఆర్ జిల్లా నుంచి వచ్చిన ఎ.వేణుగోపాల్‌ను అనకాపల్లి జిల్లాకు, విశాఖ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న వి.శ్యామ్‌కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లా నుంచి వచ్చిన కె.జయప్రకాష్‌ను అల్లూరి జిల్లాకు.. అనకాపల్లి నుంచి వచ్చిన ఎం.వి.వి. ప్రసాద్‌ను అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. శ్రీకాకుళం నుంచి విశాఖ వచ్చిన పి.అమలను పెదగంట్యాడ తహసీల్దార్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన డి.రవిని విశాఖ కలెక్టరేట్‌లో కో–ఆర్డినేషన్ కమిటీ తహసీల్దార్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన ఎం.భుజంగరావును ములగాడ తహసీల్దార్‌గా , ములగాడ తహసీల్దార్ తారకేశ్వరిని జీవీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్‌గా నియమించారు.

వనాల సంరక్షణతోనే మానవాళి మనుగడ

విశాఖ పోర్టు అథారిటీ పర్సనల్ అధికారి కనకరాజు



సమావేశంలో మాట్లాడుతున్న పర్సనల్ అధికారి కనకరాజు

చింతపల్లి: వనాల సంరక్షణతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని పర్యావరణ పరిరక్షణకు అంతా విధిగా మొక్కలు నాటాలని విశాఖ పోర్టు అథారిటీ పర్సనల్ అధికారి కనకరాజు అన్నారు. నవనిర్మాణసమితి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చింతపల్లి మండలం గొందిపాకల్లో లక్ష మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా గిరిజనులతో కలసి పోర్టు అధికారులు పలురకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పోర్టు అధికారులు వేణుగోపాల్, ఉదయ్‌భాస్కర్, రాధిక, కనకరాజు, సుధీర్, చాందిని, సర్పంచ్ సాగిన వరలక్ష్మి కార్యదర్శి పూర్ణచంద్రరావు, గ్రామస్తులు బౌడు కుశలవుడు నవనిర్మాణసమితి సభ్యులు కామేశ్వరరావు, రవికుమార్ సుబ్బయ్య, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కారు

ప్రమాదాల చేసుకుంటూ మితిమీరిన వేగంతో ప్రయాణం



కూనవరం: చింతూరు మీదుగా కారులో నలుగురు యువకులు కూనవరం వైపు వస్తుండగా చట్టి జంక్షన్లో ఒక టూవీలర్‌ను ఢీకొన్నట్లు తెలిసింది. అక్కడి నుంచి కారును మరింత వేగంగా నడుపుకుంటూ పెద్దార్కూరు, భీమవరంలో కొందరిని ఢీకొని ముందుకు వెళ్లుండగా పోచవరంలో చాపల శీను అన్న వ్యక్తి ని గుద్ది, కారు ఆపకుండా వెళ్ళగా పోలిపాక వద్ద కొందరు దారి కాచి కారును అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసరావు అక్కడకు వెళ్లి వారిని స్టేషన్ కు తీసుకువచ్చి విచారించగా రంగారెడ్డి జిల్లా రావిరియాల గ్రామానికి చెందిన వారుగా తెలిపారు. విహారయాత్రకు విజయవాడ వచ్చి, అలాగే వైజాగ్ వెళ్లి అక్కడ నుంచి అరకు చేరుకొని ఆ తర్వాత భద్రాచలం వెళ్లేందుకు చింతూరు మీదుగా కూనవరం వైపు వచ్చినట్లు చెప్పారని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌కు గణపతి విగ్రహం

- దాదాపు రెండు గంటల పాటు స్టేషన్‌లోనే నిరీక్షణ
- పోలీసులతో కమిటీ సభ్యుల వాగ్వాదం

డాబాగార్డెన్స్: పోలీసుల అత్యుత్సాహంతో వినాయకుడు దాదాపు రెండు గంటల పాటు పోలీస్‌స్టేషన్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకుని నిమజ్జన ఊరేగింపులో పోలీసులు గణేశుడి విగ్రహాన్ని స్టేషన్‌కు తరలించిన ఘటన వివాదాస్పదంగా మారింది. శనివారం రాత్రి కంచరపాలెం కప్పరాడ ప్రాంతానికి చెందిన కమిటీ సభ్యులు గణపతిని నిమజ్జనం చేసేందుకు పెదవాల్తేరు జాలారిపేట బీచ్‌కు ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. అర్ధరాత్రి దాటిపోవడంతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఓ కానిస్టేబుల్ ఊరేగింపును అడ్డుకున్నారు. డీజే కాకుండా సౌండ్ బాక్స్‌లను ఉపయోగించినప్పటికీ విగ్రహాన్ని వాహనంతో సహా పోలీస్‌స్టేషన్‌లోకి తరలించారు. ఈ చర్యకు నిరసనగా కమిటీ సభ్యులు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు.

తమను అడ్డుకున్న కారణాలను ప్రశ్నించగా పోలీసుల నుంచి తగిన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తర్వాత వస్తున్న విగ్రహాలను కూడా స్టేషన్‌లో పెట్టాలంటూ సభ్యులు రోడ్డుపై బైఠాయించారు. పోలీసుల తీరును నిరసిస్తూ ఊరేగింపులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, కమిటీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇలా దాదాపు రెండు గంటల పాటు పోలీస్‌స్టేషన్‌లోనే గణపతి బప్పా నిరీక్షించాల్సి వచ్చింది. అర్ధరాత్రి రెండు గంటల తర్వాత విగ్రహాన్ని విడిచిపెట్టడంతో కమిటీ సభ్యులు సముద్రంలో నిమజ్జనం చేశారు.

గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరం



దేముడువలసలో గిరిజనులతో మాట్లాడుతున్న అరకులోయ సీఐ హిమగిరి

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ, గసభ పంచాయతీల పరిధిలోని దేముడువలస, సోవాంప, కొత్రగొంది, సిమిలిగుడ గ్రామాల్లో అరకులోయ సీఐ హిమగిరి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని, గిరిజనులు దూరంగా ఉండాలన్నారు. వాణిజ్య పంటలైన కాఫీ, అల్లం, మిరియాలు తదితర పంటల సాగుపై గిరిజనులు దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమకు తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. సిబ్బంది తదితరులున్నారు.



కామయ్యపేటలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సన్యాసినాయుడు

హుకుంపేట: మండలంలోని మారుమూల ఒడిశా సరిహద్దు సమీపంలోని కామయ్యపేటలో సీఐ సన్యాసినాయుడు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. గంజాయి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశనమవుతాయన్నారు. యువత ఉన్నత విద్య అభ్యసించాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు కొర్ర నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

అప్పన్న ఆస్తుల పరిరక్షణే ధ్యేయం

- సింహాచలం ఈవోగా త్రినాథరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. దేవస్థానం ఈవోగా త్రినాథరావు ఆదివారం సింహగిరిపై బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానం ఇన్‌చార్జిగా ఈవోగా ఉన్న దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానానికి ఇప్పటివరకు మూడుసార్లు ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించానని, ఇప్పుడు బదిలీపై పూర్తిస్థాయి ఈవోగా రావడం సంతోషంగా ఉందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మంచి వాతావరణంలో దర్శనం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. అంతకుముందు ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ హరి, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, రాజేంద్ర కుమార్, పిల్లా శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు తదితరులు ఈవోని కలిసి అభినందలు తెలిపారు.

పరారైన తహసీల్దార్ హత్య కేసు నిందితుడి అరెస్టు

మధురవాడ: బెయిల్ రద్దయిన తరువాత నగరం నుంచి పరారైన తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసు నిందితుడు మురారి సుబ్రహ్మణ్యం గంగారావు పోలీసులకు చిక్కాడు. అతడిని విజయవాడలో పీఎంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గంగారావు బెయిల్ రద్దయిన తర్వాత ఎటువంటి సమాచారం లేకుండా నగరాన్ని వదిలి వెళ్లిపోయాడు. దీంతో అతడిపై కోర్టు నాన్ బెయిల్ వారంట్ ఇచ్చింది. పీఎంపాలెం పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి విజయవాడలో అతడిని అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ బాలకృష్ణ చెప్పారు.

కొత్త సబ్ రిజిస్ట్రార్లు

విశాఖ సిటీ: జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ల బదిలీ కౌన్సెలింగ్ ముగిసింది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి 48 మంది సబ్ రిజిస్ట్రార్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ మినహా మిగిలిన వారందరూ బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించారు. ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్ మరో నాలుగు నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో బదిలీల మార్గదర్శకాల ప్రకారం ఆయనకు బదిలీల నుంచి మినహాయింపు లభించింది. భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా హర్షవర్ధన్‌రెడ్డి, మధురవాడకు చక్రపాణి, పెందుర్తికి కీర్తి ప్రియ, గోపాలపట్నంకు లక్ష్మీనారాయణ, గాజువాకకు తారకేష్, పెదగంట్యాడకు రోహన్, సూపర్ బజార్ సబ్ రిజిస్ట్రార్‌గా సంజీవయ్య నియమితులయ్యారు.

ఓనం.. వైభవం

వేడుకగా కేరళ సంప్రదాయ ఉత్సవం

ప్రత్యేక ఆకర్షణగా పూక్కళం, సద్య

ఆశీస్సులు అందించిన 'బలి చక్రవర్తి'



కేరళీయుల సంరక్షకుడు బలి చక్రవర్తికి ఆహ్వానం పలుకుతున్న మహిళలు



కేరళ సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన నందినీ మీనన్‌ను సత్కరిస్తున్న సమితి సభ్యులు

మురళీనగర్: నగరంలో నివసిస్తున్న కేరళీయులు తమ సంప్రదాయ ఓనం ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. నమో కేరళీయం అంటూ తమ ఆచార వ్యవహారాలకు అనుగుణంగా కుల, మత బేధాలతో సంబంధం లేకుండా ఓనం జరుపుకున్నారు. బిర్లా కూడలి సమీపంలోని కేరళ కళా సమితిలో ఈ ఉత్సవాలు జరిగాయి. ఎక్కడ ఉన్నా తమ సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగిస్తామని, మాతృభాష మలయాళంనకు ప్రాధాన్యమిస్తామని చాటిచెప్పారు. కేరళ కళాసమితిని అందంగా ముస్తాబు చేసి ఓనంకు ఆహ్వానం పలికారు.

పూక్కళం వద్ద పూజలు

ప్రత్యేకంగా అలంకరించిన వేదిక వద్ద ధాన్యపు రాసులు, కొబ్బరిపువ్వు, దీపపు కుందెలు ఏర్పాటు చేశారు. వీటి దిగువన పూల తివాచీ పూక్కళంను అమర్చారు. మహిళలు తమ సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. 10.30 గంటలకు 'బలి చక్రవర్తి' ఉత్సవ ప్రాంగణానికి విచ్చేయగా మహిళలు ఆయనకు ఎదురెళ్లి పూలతో స్వాగతం పలికారు. ఆయన రాక సందర్భంగా కేరళ సంప్రదాయ వాద్య పరికరాతో సందడి చేశారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని బలిచక్రవర్తి ఆశీర్వదించారు.

పలువురికి ఘన సత్కారం

కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాహిత్య అకాడమీ బహుమతికి ఎంపికైన నందినీమీనన్‌ను కేరళ ఎమ్మెల్యే చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ట్రావలాగ్ ఆమ్‌చో బస్తార్ అనే రచనకు ఈ పురస్కారం లభించింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న సతీష్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ సంప్రదాయ శాస్త్రీయ నృత్యాలు వీక్షకులను అలరించాయి. చిత్ర గీతాలు వీనులవిందుగా సాగాయి. వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా 29 రకాల వంటకాలతో తయారు చేసిన 'సద్య'ను విందు భోజనంగా అందించారు. నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన 2 వేల మంది కేరళీయులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.



సామాజిక సేవలో కేరళీయుల ముందంజ

వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కేరళ ఎమ్మెల్యే ప్రమోద్ నారాయణ మాట్లాడుతూ కేరళీయులు ఎక్కడ ఉన్నా సామాజిక సేవల్లో ముందంజలో ఉంటారని చెప్పారు. కేరళ ప్రజలు తమ మూలాలను మర్చిపోకుండా సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం అందరికీ ఆదర్శనీయమన్నారు. నగరంలోని తెలుగు ప్రజలతో మమేకమై ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ అడ్మిరల్ విజయశేఖర్, ఎన్ఎస్టీఎల్ అవుట్ స్టాండింగ్ సైంటిస్ట్ డాక్టర్ అబ్రహం వర్గీస్, ట్రాయ్ పూర్వ సభ్యురాలు డాక్టర్ విజయలక్ష్మి కె.గుప్తా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన కేరళ విద్యార్థులకు అతిథులు చేతుల మీదుగా నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కేరళ కళా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఏఆర్‌జీ ఉన్నిత్తన్, కెప్టెన్ లైలా గణేష్, కోశాధికారి సురేష్, ఆలిండియా మలయాళీ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు ఎస్ఎం పిళ్లై, కైరళీ ఆర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు బిజు పీఎస్, సైమన్ తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ దుస్తుల్లో ఓనంకు ఆహ్వానం పలుకుతున్న మహిళలు